www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 మార్చి 2023
5
పశ్చిమ గోదావరి

రేపు స్పందన రద్దు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 13వ తేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ఈ నెల 13 జరగనుందని ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రకటనలో వెల్లడించారు.

దగ్గు, జలుబు.. జనంలో గుబులు..!

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

వైరస్‌లే కారణమని సర్వత్రా ఆందోళన

ఆసుపత్రులకు క్యూ కడుతున్న వైనం

సూచనలు చేయని వైద్యఆరోగ్య శాఖాధికారులు



ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు జలుబు, దగ్గు, జ్వరాలతో మూలుగుతున్నారు. రాత్రివేళల్లో చలి తీవ్రత పూర్తిగా తగ్గకపోయినా పగటి వేళల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు రెండు రోజులపాటు పగటి వేళల్లో ఎండ తీవ్రత తగ్గి కొన్ని గంటలపాటు మబ్బులు కమ్ముకోవడం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఈ వాతావరణ మార్పులతో జనం మంచమెక్కుతున్నారు. ప్రధానంగా జలుబు, దగ్గుతోపాటు జ్వరం వస్తుండటంతో జనం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కరోనా తగ్గుముఖం పట్టిందనుకున్న తరుణంలో ఇప్పటికే గుండెపోట్లు పెరిగి హఠాన్మరణాలు సంభవించడం, తాజాగా జలుబు తీవ్రత పెరిగి రోజులు తరబడి తగ్గకపోవడం జనాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలోనే రకారకాల వైరస్‌లు ప్రబలుతున్నాయనే వార్తలతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో కొద్దిపాటి జలుబు చేసి అస్వస్థతకు గురైనా వెనువెంటనే ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అప్రమత్తతను అంతా స్వాగతించాల్సిందే. అయితే వైరస్ కారణంగానే జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారనేది బహిరంగ రహస్యం. దీంతో ప్రయివేటు ఆసుపత్రులు దగ్గును బూచిగా చూపి రకరకాల పరీక్షల పేరుతో వేలకువేలు గుంజేస్తూ ఆపై సాధారణ సమస్యేనంటూ మందులిచ్చి పంపుతున్నారు. దీంతో పేద ప్రజలు చేతి చమురు వదిలించుకుని ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పిల్లల విషయంలో అయితే శ్వాసపరమైన సమస్యల పేరిట ఇన్‌పేషెంట్లుగా చేర్చుతున్నారు. దీనికి రోజుకు వేలల్లోనే వసూలు చేస్తున్నారు. పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా జిల్లా అధికారులు ప్రత్యేకంగా వైద్య ఆరోగ్య శాఖాధికారులు జనం ఆరోగ్య పరిస్థితులపై స్పందించడంగాని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారంగాని చేపట్టకపోవడం అందరినీ ఆవేదనకు గురిచేస్తోంది. ప్రధానంగా సాధారణ జలుబు, దగ్గు ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రచారం చేయడంతోపాటు ఇతర సమస్యలుంటే స్థానిక పిహెచ్‌సిల్లో వైద్యాధికారులు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు చేపట్టడం చాలా అవసరం. అలాగే వైరస్‌లు ప్రబలుతున్నాయనే వార్తల నేపథ్యంలో వైద్యఆరోగ్య శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ముందస్తుగా ప్రచారం చేస్తే జనంలో ఆందోళన తొలగుతుంది. అలాకాకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే జిల్లా ప్రజలు ఆందోళనతో ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలకు వేలు సొమ్ము వెచ్చించాల్సిన దుస్థితి దాపురిస్తోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల హడావుడిలో మునిగిన జిల్లా అధికారులు వెంటనే స్పందించి వైద్యఆరోగ్య శాఖను కార్యాచరణకు దింపాల్సి ఉంది. లేనిపక్షంలో ప్రధానంగా విద్యార్థులకు పరీక్షల సీజన్ కావడంతో వారు లేనిపోని ఆందోళనలు, అనారోగ్యాలతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీనిపై రెండు జిల్లాల అధికారులు తక్షణం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

లేసు ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

నరసాపురం అలంకృతి లేసు పార్కు ఉత్పత్తుల మార్కెటింగ్ విస్తరణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ లేసు పారుపై సంబంధిత అధికారులతో సమీక్షించి మాట్లాడారు. లేసు ఉత్పత్తులు ప్రజాదరణ పొందేలా నూతన డిజైన్లు రూపొందించడంతోపాటు, మార్కెటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 35 కామన్ ప్రొడక్షన్ సెంటర్స్, 15 కామన్ ఫెసిలిటేషన్ సెంటర్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వీటికి భారత ప్రభుత్వం కేటాయించిన నిధులకు సంబంధించిన యూసీ లను వెంటనే సంబంధిత శాఖకు అందజేయాలన్నారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ ద్వారా ఔత్సాహికులకు శిక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ శాఖ విజయవాడ హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.అపర్ణ లక్ష్మి, జిల్లా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ అధికారి కె.అప్పారావు, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, పరిశ్రమ శాఖ ఐపిఒ, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం మాస్టర్ ప్లాన్‌కు.. అధికారులు చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

మాస్టర్ ప్లాన్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

సామాన్యుల హక్కులు, ప్రయోజనాలకు ఇబ్బంది కలగకుండా భీమవరం మాస్టర్ ప్లాన్-2041 రూపొందేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో భీమవరం మాస్టర్ ప్లాన్ - 2041 డ్రాఫ్ట్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. చిన్న, మధ్య తరహా రైతుల పంట భూములకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో నిర్దేశించిన శాతానికి గ్రీనరీ ఏర్పాటుకు వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. నూతన మాస్టర్ ప్లాన్‌లో ఉండి, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, తోకతిప్ప, చెరుకువాడ ప్రాంతాలను కలిపి రూపొందించాలన్నారు. డ్రాఫ్ట్ ప్లాన్‌పై స్వీకరించిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. రిక్రియేషనల్ ఏర్పాటుకు ఎక్కువ ప్రాంతాలు కాకుండా ఒకటి, రెండు ఎంపిక చేస్తే సరిపోతుందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి లెక్కల ప్రకారం భీమవరం మున్సిపల్ ఏరియా 25.96 స్క్వేర్ కిలోమీటర్లు, జనాభా 1.42 లక్షలు ఉందన్నారు. 2020 నాటికి 48.95 స్క్వేర్ కి.మీలు, జనాభా 1.67 లక్షలుగా ఉందని పేర్కొన్నారు. 2041 నాటికి అంచనా జనాభా 2.33 లక్షలకు అనుగుణంగా భీమవరం మాస్టర్ ప్లాన్-2041ను రూపొందించనున్నామని తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, పబ్లిక్, సెమీ పబ్లిక్, రిక్రియేషనల్, ట్రాన్స్పోర్ట్, కమ్యూనికేషన్, అగ్రికల్చర్, ప్రత్యేక ప్రాంతం, వాటర్ బాడీస్‌కు శాతాల వారీగా అభివృద్ధి ప్లాన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇయుడిఎ (ఏలూరు అర్బన్ డవలప్మెంట్ అథారిటీ) వైస్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్, భీమవరం మున్సిపల్ కమిషనర్ శివ రామకృష్ణ, ఎసిపి గౌర్, రాజమహేంద్రవరం టిపిఎ వి.వి.రమణ, డిప్యూటీ సిపిఒ కె.కోటేశ్వరరావు, ఇయుడిఎ పిఒ ఎన్.సురేఖ, ఎపిఒ వి.సుధాకర్ పాల్గొన్నారు.

రోజా పువ్వు అందించి హెల్మెట్ ధరింప చేస్తున్న ఎస్‌పి రవిప్రకాష్

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - వీరవాసరం

ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌పి రవిప్రకాష్ అన్నారు. హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్‌ను ఎస్‌పి రవిప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం వీరవాసరంలో నిర్వహించారు. గతానికి భిన్నంగా జరుగుతున్న ఈ డ్రైవ్‌లో ఫైన్‌లకు స్వస్తి చెప్పి హెల్మెట్ లేని వాహనదారులచే అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేయించి వారిచే ధరింపచేస్తున్నారు. ఈ డ్రైవ్‌లో హెల్మెట్ కొనుగోలు చేయించడంతో పాటు వారికి ఒక రోజా పువ్వుతో అభినందించి పింపించారు. ఈ డ్రైవ్‌లో సిఐ నాగప్రసాద్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

ప్రతి పరీక్షా కేంద్రానికీ నోడల్ అధికారి

ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసి రాజు

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రతి పరీక్షా కేంద్రానికీ ఒక నోడల్ అధికారిని నియమిస్తున్నామని ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాలను ఆర్‌డిఒ శనివారం పరిశీలించారు. మండలంలో విద్యా వికాస్ జూనియర్ కళాశాల, కార్తికేయ జూనియర్ కళాశాల, దుంపగడపలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అయితే ఆర్‌డిఒ రెండు ప్రయివేటు కళాశాలను పరిశీలించారు. ఆయా కళాశాలలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పరీక్షా కేంద్రానికీ ఒక మహిళా పోలీసును, వైద్య సహాయం కోసం ఒక ఎఎన్ఎంను ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు అనుమతించేది లేదన్నారు. పరిసరాల్లోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షా సమయంలో మూసివేస్తామన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - భీమవరంరూరల్

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తుందూరు గ్రామం చిన్నపేటలో శనివారం గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్టి చంద్రమ్మ, మరియమ్మ, పాలపర్తి సుచిత్ర, నాగరత్నం పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

రెక్కల కష్టం మీద ఆధారపడి జీవిస్తున్న ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తణుకు మండలం మండపాక గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతల వద్ద కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పూటలా పని, మస్తరు విధానం వల్ల పని ప్రదేశంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేకపోతున్నామని తెలిపారు. దీనిపై చిన వీరభద్రరావు మాట్లాడారు. ఉపాధి హామీకి ప్రభుత్వం ప్రకటించిన రూ.257 కాకుండా వేతనాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పని అడిగిన వారికి వంద రోజులు పని కల్పించాలన్నారు. బెంగాల్ యూపీ కూలీలు రావడం, వీటికి తోడు వ్యవసాయ భూములన్నీ పరిశ్రమలు, ఇళ్ల స్థలాలకు కేటాయించడం వల్ల పనులు తగ్గిపోయి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చేసిన పనికి ప్లే స్లిప్పులు ఇవ్వాలన్నారు. డిమాండ్ల సాధనకై వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో. వ్యవసాయ కార్మికులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నమట్ల రామారావు, వీరవల్లి వరలక్ష్మి, గారపాటి ధనరాజు, పొట్ల దానమ్మ, ఉన్నమట్ల ప్రశాంతి, అరిగెల మునెమ్మ, ఎలిసెట్టి కేశవరావు, ఎర్ర పెద్ద అప్పారావు, కొండపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

వేగంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం

ఎంఎల్‌సి గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం సాయంత్రం ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఈ ఆసుపత్రి నిర్మాణానికి సహకరించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. వంద పడకల హాస్పిటల్ ఉంటే అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య స్పెషలిస్టులు అందుబాటులో ఉంటారని, అత్యాధునిక వైద్య పరికరాలు కూడా సమకూర్చుకోడానికి అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజలకు ఈ ఆస్పత్రి మెరుగైన వైద్య సేవలందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కృష్ణాజిల్లా సరిహద్దు గ్రామాల ప్రజలకు కూడా ఈ ఆసుపత్రి అందుబాటులో ఉంటుందని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు ఆసుపత్రులకు పెద్ద ఎత్తున బకాయిలు పెట్టారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బకాయిలను కూడా పూర్తిస్థాయిలో చెల్లించి, ఆరోగ్యశ్రీ పథకాన్ని పేద ప్రజల కోసం అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా భీమవరం నియోజకవర్గ ప్రజలకు కూడా పూర్తిస్థాయిలో అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్యాన్ని అందించేందుకు ఈ వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు.

హక్కుల సాధనకు కదిలి రావాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

8 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనలో కార్మికులు, కర్షకులు, స్కీం వర్కర్ల హక్కులను హరించి వేసిందని హక్కుల సాధనకు అంతా కదిలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు అక్రియ్య పిలుపునిచ్చారు. పాలకోడేరులో ఏప్రిల్ 5న నిర్వహించబోయే చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను తుంగలోతొక్కి బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. ఢిల్లీలో రైతులు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో దున్న మరియమ్మ, లక్ష్మి, వెంకటలక్ష్మి, రామారావు, దుర్గ పాల్గొన్నారు.

ప్రచారం.. ఆందోళన..!

స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు ముగిసిన ప్రచారం

డిమాండ్ల సాధనకు రోడ్డెక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరులో కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి రెండు స్థానాల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ఈ నెల 13న సోమవారం జరగనుంది. దీనికి సంబంధించి ప్రచారం ఇప్పటికే ముగిసింది. టిడిపి నేతలు స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా స్థానిక సంస్థల నిర్వీర్యం, నిధులు విడుదల చేయకపోవడం, గ్రాంట్లను సైతం మళ్లించడం వంటి అంశాలను ప్రధానంగా టిడిపి నేతలు ప్రచారం నిర్వహించారు. అయితే గెలుపోటములు ఎలాగున్నా వైసిపి ప్రభుత్వం తీరును స్థానిక ప్రజాప్రతినిధుల్లో మరోసారి ఎండగట్టడంలోనూ, వైసిపి అభ్యర్థులకు గుబులు పుట్టించడంలోనూ తాము విజయవంతమయ్యామని తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు. ఇక వైసిపి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ ప్రచారం నియోజకవర్గాలవారీ సాగింది. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాలకు హాజరై తమకు ఓటు వేయాల్సిన విధానం గురించి వివరించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేకత ఈ ఎన్నికలపై ప్రభావం చూపకుండా వైసిపి ఓట్లన్నీ తమకే పడేలా ఎంఎల్‌ఎలను రంగంలోకి దించారు. డెల్టాలో కొంచెం ధైర్యమున్నా మెట్ట ప్రాంతంలో ఎంఎల్‌ఎలు, ఎంపీల గ్రూపులు వేర్వేరుగా ఉండటం, ఇక్కడ పార్టీని ఏకతాటిపై నడిపించే నేత లేకపోవడంతో రాష్ట్ర నేతలను రంగంలోకి దించారు. దీనిలో భాగంగానే వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ మిధున్‌రెడ్డి ఏలూరు జిల్లా పరిధిలో పలు నియోజకవర్గాల్లో పర్యటించి ప్రచారం సాగించారు. పైగా కొన్ని కేంద్రాల్లో మాక్ పోలింగ్ కూడా నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధులు ఓటింగ్‌లో తడబాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ముందస్తు క్యాంపులు నిర్వహించాలనుకున్నా అధిష్ఠానం సూచనలతో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలిసింది. డివిజన్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించనుండడంతో మండలాలవారీ ఓటర్లను సకాలంలో అక్కడికి తీసుకొచ్చేందుకు, కొంత దూర ప్రాంతంలోని వారినైతే ఆదివారం ఉదయానికే ఆయా ప్రాంతాలకు రప్పించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. మొత్తానికి నల్లేరు మీద నడకలా సాగాల్సిన వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపు కత్తిమీద సాములా మారిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

సిపిఎస్ రద్దు, పాత బకాయిల జమ, పిఆర్‌సి ఏర్పాటు తదితర అంశాలపై ఎపి జెఎసి అమరావతి పిలుపు మేరకు ఈ నెల 9 నుంచి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సిపిఎస్ రద్దు, ఇతర హామీల కోసం ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానంగా యుటిఎఫ్ వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గతం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనలకు మద్దతు పలుకుతున్న సిపిఎం, సిపిఐ తాజాగా ప్రత్యక్ష ఆందోళన చేపట్టాయి. అదే సమయంలో ఏలూరు, భీమవరంలోని కలెక్టరేట్లలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన బాట పట్టారు. ఇక ఏలూరు, భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు విద్యారంగాన్ని పరిరక్షించాలని, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఆందోళన బాట పట్టారు. మొత్తంగా ఇటు ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు అటు వామపక్షాలు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, కక్షసాధింపు చర్యలు వీడాలని గొంతెత్తడం జిల్లాలోని ప్రజాప్రతినిధులకు సంకటంగా మారింది. ఇప్పటికే పలువురు ఎంఎల్‌ఎలు ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల తమ అధినేత తీరు సరికాదని, ఇది రానున్న ఎన్నికల్లో కొంపముంచే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో ఇకనైనా ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా, లేక అలానే తన దుందుడుకు వైఖరి కొనసాగించి నష్టపోతుందా అనేది వేచిచూడాలి.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే

ప్రజాశక్తి - ఉండి

సరిహద్దు సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చినపుల్లేరు గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.దాసు తెలిపారు. శనివారం చినపుల్లేరు గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేనుద్దేశించి దాసు మాట్లాడుతూ సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో భూ రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక డ్రోన్ ద్వారా రీ సర్వే చేయడం వల్ల పారదర్శకంగా ఎటువంటి తప్పులు లేకుండా సరిహద్దులను గుర్తించడం జరుగుతుందన్నారు. గ్రామంలో రీ సర్వే చేయడానికి సిబ్బంది వచ్చినప్పుడు రైతులు తమ పాస్ పుస్తకాలను, డాక్యుమెంట్లను వారికి చూపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పెన్మెత్స సావిత్రి, ఉప సర్పంచి బొర్రా సువర్ణరాజు, ఎంపిటిసి రాయి రాములమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో కాంగ్రెస్ పాదయాత్ర

ప్రజాశక్తి - కాళ్ల

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ చేస్తామని పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర విజయవంతం అయిన సందర్భంగా జువ్వలపాలెంలో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. పాదయాత్రలో జిల్లా జనరల్ సెక్రటరీ బొర్రా పార్థు, మండల అధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సోము నాగ కేశవబాబు పాల్గొన్నారు.

నేడు వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 12న వైసిపి 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో పార్టీలో వివిధ హోదా కలిగిన నాయకులు పాల్గొనాలని శ్రీనివాస్ కోరారు.

దేవస్థాన ఛైర్మన్ దండు వెంకటకష్ణంరాజు విరాళం అందిస్తున్న దాతలు

అన్న సమారాధనకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే అన్న సమారాధనకు దాతలు శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన పొదిలాపు నాగేశ్వరరావు కుమారుడు పొదిలాపు పాపారావు, మధుసాయి నాగలక్ష్మి దంపతులు స్వామివారి కళ్యాణ మహోత్సవాల్లో జరిగే అన్న సమారాధన నిమిత్తం 50 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి చాగంటి.సురేష్ నాయుడు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు దండు వెంకట కృష్ణంరాజు పాల్గొని దాతలను సత్కరించారు.

శైలజకు పలువురి అభినందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళా దినోత్సవం సందర్భంగా తమ కళాశాల విద్యార్థిని భీమవరంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ప్రతిభా అవార్డు పొందడం అభినందనీయమని పెనుగొండలోని ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ సైన్స్ కళాశాల బాక్సింగ్ కోచ్ చిరంజీవి అన్నారు. నత్తారామేశ్వరం శివారు పంపన వారి పాలేనికి చెందిన కోడె తేజస్విని వెంకట శైలజ ఆ కళాశాలలో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆమె బాక్సింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు సాధించింది. ఈ సందర్భంగా మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో శైలజ కలెక్టర్ ప్రశాంతి, జిల్లా జడ్జి సత్యదేవి, ఇతర మహిళ అధికారులు చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా శైలజాకు కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. శైలజను కళాశాల యాజమాన్యంతో పాటు గ్రామ ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా కోడె తేజస్విని వెంకట శైలజ మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి తన తల్లిదండ్రులను బాగా చూసుకోవడంతో పాటు తనలాంటి క్రీడాకారులను తయారు చేసి వారికి కూడా మంచి గుర్తింపు వచ్చేలా చేయడమే తన ధ్యేయమని తెలిపింది.

పాలకొల్లులో ఆదర్శ వివాహం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో శనివారం ఆదర్శ వివాహం జరిగింది. వివాహ కర్తగా పిట్టా నవరత్న వ్యవహరించారు. 18వ వార్డు అగ్ర కులానికి చెందిన దాసిరెడ్డి సాయికి, షెడ్యూల్ కులానికి చెందిన ఇంజమూరి రాణికి వివాహం చేశారు. వివాహానికి పలువురు పెద్దలు సహకరించారు. నేతలు రంగరావు, ముద్దాడ గణేష్, భవాని, పిల్లి పెట్రిక్ రాజు, మట్టా చంద్రశేఖర్, పాలపర్తి కృపానాథ్, బద్ద అంతర్వేది, పోలుకొండ వేణుగోపాలరావు, నేతాల భద్రరావు, గెడ్డం బాబు, గెడ్డం సురేష్, చీకట్ల మహేష్, పెదపాటి కిరణ్, వర్ధనపు జాన్, బత్తిన అశోక్, పోలుకొండ శ్రీను పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ అన్యాయం

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాజ్

ఉండి : దళితుల చెరువును ఆక్రమించడం అన్యాయమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఉండి మండలం పాములపర్రు గ్రామంలో దళితులకు చెందిన మంచినీటి చెరువును వేరే సామాజిక తరగతి వారు ఆక్రమించుకోవడమే కాకుండా ఇటీవల అక్కడ భగీరథ విగ్రహం ఏర్పాటుచేసి గ్రామంలో యుద్ధ వాతావరణం నెలకొల్పారన్నారు. చెరువు విషయంలో ఎన్నో సంవత్సరాలుగా ఆక్రమణ జరుగుతుందని అధికారులకు ఎన్ని అర్జీలు పెట్టుకున్నా దళితులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ గ్రామంలో ఉన్న దళితులతో కలిసి దీక్షలో కూర్చున్నారు. అనంతరం ఆర్‌డిఒ దాసిరాజుతో పుష్ప రాజ్ ఫోన్‌లో మాట్లాడగా దాసిరాజు స్పందించి ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో తనకు సమస్య పరిష్కారం చేయడానికి 17వ తేదీ వరకు సమయం కావాలని చెప్పారు. సమస్యలు పరిష్కరిస్తామని అక్కడున్న విఆర్‌ఒ, సెక్రటరీ సమక్షంలో దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి తాత్కాలికంగా దీక్ష విరమించారు. 17వ తేదీన సమస్య పరిష్కారం కాకపోతే 18వ తేదీన కార్యాచరణ ప్రకటిస్తామని పుష్పరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, ఉండి మండల అధ్యక్షులు తొర్లపాటి భాగ్యరాజ్, నియోజకవర్గ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి చిల్లి రాజ్‌కుమార్, భీమవరం నియోజకవర్గ అధ్యక్షులు పిట్టా వినోద్‌కుమార్, భీమవరం మండల అధ్యక్షులు దాసరి చిరంజీవి, భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి నేతల సాల్మన్‌రాజు, భావన మోషే, సాగర్, వంశీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పది పరీక్షలకు ప్రత్యేక ప్రణాళిక

పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత దిశగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.. ఒక పక్క ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, మరో పక్క ఒక్కో ఉపాధ్యాయుడు ఐదుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకుంటూ వారి ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా స్టడీ అవర్స్ పెట్టి చదివిస్తున్నారు.. విద్యార్థుల ఉత్తీర్ణతకు తీసుకుంటున్న చర్యలు, వారికి ఇస్తున్న సూచనలు, సలహాలపై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రజాశక్తికి వివరించారు.. - ప్రజాశక్తి యంత్రాంగం

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.. ★ ★ ★

జి.శేఖర్ బాబు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు, ఎంవిఆర్ హైస్కూల్, ఆచంట

పదదో తరగతి పరీక్షల్లో గత సంవత్సరం ఫలితాలను దృష్టిలో పెట్టుకొని నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా డిసెంబర్ నుంచి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ఈ ఏడాది 114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఒకటి, రెండు గ్రేడుల్లో ఉన్న విద్యార్థులకు మరింత బాగా తర్ఫీదు ఇస్తున్నాం. మూడు, నాలుగు గ్రేడుల్లో ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులకు దత్తతిచ్చి వారి ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు సూచనలు సలహాలు అందిస్తున్నారు. ముఖ్యంగా సి, డి గ్రేడుల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం.

పాఠ్యాంశాలను అర్థం చేసుకోవాలి.. ★ ★ ★

ఎన్.పోసియ్య, ఎన్ఎస్ ఉపాధ్యాయులు, ఎంవిఆర్ హైస్కూల్, ఆచంట

విద్యార్థులు పాఠ్యాంశాలను పూర్తిగా అవగాహన చేసుకుంటే మంచి ఫలితాలు సాధించొచ్చు. బట్టి పట్టే పద్ధతులను పూర్తిగా వదిలిపెట్టేందుకు విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందిస్తున్నామం. పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ముఖ్యమైన పాఠ్యాంశాలను మరో మారు చదివించడంతోపాటు, సమాధానపత్రంలో అక్షరాలు స్పష్టంగా గుండ్రంగా రాసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పబ్లిక్ పరీక్షల్లో ప్రశ్నల తీరును అర్థం చేసుకొని సమాధానం రాస్తే మంచి ఫలితాలు సాధించొచ్చు. ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకొని వారి ఇంటికెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పలు సూచనలు సలహాలు అందిస్తున్నాం. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి గత పరీక్షల మార్కులు, హాజరుపై ఉపాధ్యాయులు చర్చిస్తున్నారు.

ఎ గ్రేడ్ సాధిస్తా.. ★ ★ ★

సిహెచ్ భాగ్యశ్రీ, పది విద్యార్థిని, ఆచంట

పది పరీక్షల్లో ఎ గ్రేడ్ సాధించేందుకు కష్టపడి చదువుతున్నాను. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు. మా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఐదుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకున్నారు. రాత్రి సమయాల్లో ఫోన్ చేస్తున్నారు. సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం చదువుతున్నా.. ★ ★ ★

కడలి భాగ్యశ్రీ, విద్యార్థిని, మానేవారిపాలెం, ఆచంట

పదో తరగతి పరీక్షలకు ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నాను. ఏ గ్రేడ్ సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడమే నా లక్ష్యం. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేకత చూపుతున్నారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా సులభంగా అర్థమయ్యే విధంగా పాఠాలు చెబుతున్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయుల ఎంతో కృషి చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి.. ★ ★ ★

టి.పద్మిని కుమారి, జిన్నూరు హైస్కూల్ హెచ్ఎం, పోడూరు మండలం

ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. తమ పాఠశాల నుంచి ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 123 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా రివ్యూ నిర్వహించడంతో పాటు తల్లిదండ్రుల కమిటీతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అప్రమత్తం చేశాం. ప్రతి రోజూ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. ఏయే సబ్జెక్టుల్లో వెనుక బడి ఉన్నారో తెలుసుకుని వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. జిల్లాలోనే మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికపరంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం.. ★ ★ ★

కెఎస్. రామాంజనేయులు, హెచ్ఎం, గుమ్ములూరు, పోడూరు మండలం

తమ పాఠశాలలోని ప్రతి విద్యార్థీ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం. తమ పాఠశాల నుంచి 63 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రతి సబ్జెక్ట్ పైనా పూర్తిస్థాయి ప్రావీణ్యత సాధించేలా తీర్చిదిద్దుతున్నాం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. తరగతుల వారీగా ఉపాధ్యాయులు రివ్యూలు చేస్తున్నారు. ఏ సబ్జెక్ట్‌లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో తెలుసుకుని దానికి అనుగుణంగా బోధన చేస్తున్నాం.

పరీక్షలకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేశాం... ★ ★ ★

ఎఎస్‌కెవి.ప్రేమజ్యోతి, ఎంఇఒ, పోడూరు మండలం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు మండలం నుండి 487 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మండలం మొత్తం మీద మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. పోడూరు నుండి 72 మంది, పండిత విల్లూరు హైస్కూల్ నుండి 36 మంది, గుమ్మలూరు హైస్కూల్ నుండి 63 మంది, జిన్నూరు హైస్కూల్ నుంచి 123 మంది, పెనుమదం నుండి 64 మంది, వేడంగి నుండి 16 మంది, కె.చిక్కాల హైస్కూల్ నుండి 74, కవిటం నుంచి 38 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

సమిష్టి కృషితో ఫలితాల సాధన

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు : సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం మహేష్‌బాబు

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టి కృషితోనే పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించాలని పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహేష్‌బాబు అన్నారు. స్థానిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తెన్నేటి, భారతి, రామసీత, శ్రీనివాస్, శ్రీనివాసరావు, ఫణి రాజేష్, రమా ప్రతిభ, రెజీనా, రవిబాబు పాల్గొన్నారు.

కాళ్ల: విద్యార్థులకు పదో తరగతి కీలకమని సీసలి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాలా యేసుదాసు అన్నారు. మండలంలోని సీసలి, కాళ్ల, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కలవపూడి మాలవానితిప్ప, దొడ్డనపూడి, కోపల్లె, బొండాడ హైస్కూల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ఇంటి వద్ద సబ్జెక్టుల వారీగా చదుకునేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సబ్జెక్టులో సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని కోపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణమూర్తి అన్నారు. సమావేశంలో ఏలూరుపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని వి.అనురాధ, కలవపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు, దొడ్డనపూడి హైస్కూల్ హెచ్ఎం ఆర్.ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి: విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయుల బాధ్యత ఎంత ఉందో తల్లిదండ్రుల బాధ్యత కూడా అంతే ఉందని మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రి రవీంద్రనాథ్ అన్నారు. శనివారం మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సింహాద్రి రవీంద్రనాథ్ మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఉదయాన్నే నిద్ర లేపి పాఠ్యాంశాలను కూలంకషంగా చదివించాలన్నారు. నమూనా పేపర్ల ద్వారా విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయాన్ని పోయేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు ఇస్తున్నామన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత తమ లక్ష్యమని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. గత పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యాబోధనలో మెలకువలు నేర్పించడం జరుగుతుందన్నారు. మండలంలోని చెరుకువాడ, ఉండి, ఎన్ ఆర్ పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారు.

యథేచ్ఛగా ఆక్రమణలు..!

రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు
ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వైనం
పట్టించుకోని అధికారులు

రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణాలు

ప్రజాశక్తి - కాళ్ల

పల్లెల్లో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఎక్కడ ఖాళీగా చిన్న జాగా కనిపించినా ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఏలూరుపాడు గ్రామంలో ఆర్‌అండ్‌బి రోడ్డును, మురుగు బోదెను సైతం ఆక్రమించి వ్యాపార, నివాస సముదాయాలు నిర్మిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అసలే రోడ్డు ఇరుకు జానెడు జాగా ఉండదు. మార్జిన్ అసలే లేదు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవాలంటే మార్గం ఉండదు. దీనికి తోడు అక్కడ పెద్ద మలుపు. ఇది మండలంలోని ఏలూరుపాడు మెయిన్ రోడ్డు సెంటర్ తీరు. విజయవాడ నుంచి భీమవరం వోల్వో బస్సులు నిత్యం తిరుగుతుంటాయి. కనీసం రోడ్డు పక్కన ప్రమాదానికి సంబంధించిన హెచ్చరిక బోర్డులు, హోర్డింగులు లేవు.

ఏలూరుపాడు గ్రామ పంచాయతీ ఆర్‌అండ్‌బి మెయిన్ రోడ్డుకు ఇరువైపులా హైస్కూల్ వద్ద నుంచి ఏలూరుపాడు బస్టాండ్ వరకు రోడ్డు మార్జిన్‌లో చిన్న, పెద్ద దుకాణాలతో పాటు పలు వ్యాపారాలు రోడ్డుపైనే కొనసాగిస్తున్నారు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

యథేచ్ఛగా వ్యాపారాలు

పంచాయతీ దగ్గర ఉన్న మలుపు వద్ద యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నా ఆర్‌అండ్‌బి, డ్రయినేజీ, పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పంచాయతీ ఆదాయమే పరమావధిగా పాటిస్తూ ఆదాయం కోసం షాపుల వద్ద పన్నులు వసూలు చేస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ సౌకర్యం కూడా లేదు. దీని అవకాశంగా తీసుకుని వ్యాపారస్తులు రోడ్డు మిదే షాపులు ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇదేమని ప్రయాణికులు, ప్రజలు ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెబుతున్నారు.

గతేడాది జులై నాలుగో తేదీ పెద అమిరంలో మోడీ పర్యటన సందర్భంగా ఏలూరుపాడులో ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు వచ్చాయి. అధికారులు తొలగించేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సంఘటన స్థలానికి వచ్చి అడ్డుకున్నారు. ఆ తర్వాత రోడ్డులో ఆక్రమణలు విరివిగా వెలిశాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించి, మార్జిన్‌లు సరిచేసి షాపులను వేరే ప్రదేశానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు ఆక్రమణ విషయంపై గ్రామ కార్యదర్శి తాళ్లూరి రత్నాకరరావును వివరణ కోరగా ఆక్రమణలు తొలగిస్తామంటే ప్రజా ప్రతినిధులు అడ్డుపడుతున్నారన్నారు. పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉన్న మలుపులో షాపులు ఉండడంతో రోడ్డు ఇరుకుగా ప్రమాదకరంగా మారింది.

ఆక్రమణలు తొలగిస్తాం

ఫణిశంకర్, డ్రయినేజీ ఎఇ, కాళ్ల

డ్రయినేజీపై ఉన్న ఆక్రమణల విషయంపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. ఆక్రమణలపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సి ఉంది. ఆక్రమణలు తొలగిస్తాం.

పాలకోడేరులో 16వరకు 144 సెక్షన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలుకు ఆదేశాలు జారీ చేసినట్లు తహశీల్దార్ షేక్ హుస్సేన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ ఆదేశాలను పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు, పోలీసు ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి - తణుకు

అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కోరుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో విజయవాడలో జరగనున్న నిరసన దీక్షలు విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శనివారం తణుకు వంక సత్యనారాయణ స్వరాజ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో భీమారావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి డిపాజిట్ల సొమ్ము చెల్లించి సంపూర్ణ న్యాయం చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన జగన్ అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ న్యాయం చేయలేకపోయారన్నారు. అధికారమే ధ్యేయంగా బాధితులకు వాగ్దానాలు గుప్పించిన జగన్ వాటిని అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో గద్దె దించడం ఖాయమని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. చనిపోయిన బాధిత కుటుంబాలకు కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం లేదన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వై.నాగలక్ష్మి, తణుకు బ్రాంచ్ అధ్యక్షుడు నల్లాకుల గణపతి, కార్యదర్శి నూనె శ్రీనివాస్, గుత్తుల కొండయ్య, మహిళ సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KOMANDURU DANIEL ARAVINDAM, S/o. Komanduru Aravindam, D.No. 11-6-39, Gandhi Nagar-2, Narasapuram-534275, WG.Dt. A.P. I have changed my name from KOMANDURI DANIEL ARAVINDAM (Old Name) to KOMANDURU DANIEL ARAVINDAM (new name). Hence after all my Documents and correspondence will be countinue with my New name KOMANDURU DANIEL ARAVINDAM.

దస్తావేజులు పోయినవి

మా క్లయింటు అయిన సత్తెనపల్లి పద్మ, వెంకటాపురం గ్రామ పంచాయితీ, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఏలూరు మండలం, ఏలూరు నాన్ మున్సిపల్ ఏరియా, వెంకటాపురం గ్రామ పంచాయితీ, బ్లాక్-2 గ్రామంలోని ఆర్.యస్.నెం. 768, 771 ర్లు దాఖలా ప్లాటు నెం. 151 రు దాఖలా చ.గ.111-0-0లు స్థలమున్నూ, యిందలి డోరు నెం. 5-86రు గల ఆర్.సి.సి. డాబా బిల్డింగు వగైరా ఆస్తి మా క్లయింటు పేర ఏలూరు ఆర్.వో.లో దస్తావేజు నెం. 12437/2006 రుగా రిజిష్టరు కాబడినది.

సదరు నెం. 12437/2006 రు గల ఒరిజినల్ క్రయదస్తావేజు రిజిస్ట్రారు ఆఫీసు రోడ్డు, ఎన్.ఆర్.పేట, ఏలూరు మార్గంలో పడిపోయినవి. సదరు ఒరిజినల్ క్రయ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియపర్చగలరు.

Tigiripalli Subbarao, Advocate, Eluru
Cell : 94400 20815

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావత్తు ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన కోనేరు విద్యాధరరావు, తండ్రి : వెంకట రామయ్య అనువారు నాకు అందించిన సమాచారం మేరకు ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్ తాడేపల్లిగూడెం శ్రీ గౌరవ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు నందు జరుగుచున్నటువంటి C.C102/2022 అను NI ACT చెక్ కేసు విషయమై దాతలు చేసిన కంప్లయింట్ నందు ముద్దాయి అయినటువంటి శ్రీమతి సుంకర అలియాస్ మరాడాని గంగారత్నం, భర్త : లేటు రామచంద్రరావు అనువారు ముద్దాయిగా ఉండి పైన తెలిపిన NI ACT చెక్ కేసు నందు నోటీసులు పుచ్చుకోకుండా కాల యాపన చేయున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వారు తీసుకోవలసినటువంటి నోటీసులను పేపరు పబ్లికేషన్ ద్వారా ఆర్డరు ఇచ్చి యున్నందున సదరు నోటీసులను ఈ పేపరు పబ్లికేషను ద్వారా తెలియజేయడమైనది. పైన తెలిపిన కంప్లయింట్ ది.29.03.2023 నాటికి పై ముద్దాయి హాజరు కొరకు వాయిదా పడియున్నందున ముద్దాయి ది.29.03.2023న తాడేపల్లిగూడెం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని మరియు ఏదైనా అర్హత కలిగిన వ్యక్తి ద్వారా హాజరు కావాల్సిందిగా తెలియజేయడమైనది. మీరు హాజరు కాకుండా గజస్తు చేసిన యెడల శ్రీ కోర్టు వారు తీసుకోబోవు తదుపరి చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

స్థలం : తాడేపల్లిగూడెం తేది : 11.03.2023

ఇట్లు: మాకా శ్రీనివాసరావు, (అడ్వకేట్)
తాడేపల్లిగూడెం. సెల్: 9848027853

సేల్ నోటీసు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.I.A.No. 85/2023
in O.S.No. 226/2012

బిట్వీన్:

చిట్టూరి సత్యనారాయణ, తండ్రి: జగ్గారావు, పురుషుడు, వయసు 80 సం॥లు, ప్రాపర్టిస్, చెబ్రోలు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
...పిటీషనరు /వాది

మరియు

మారిశెట్టి మాణిక్యాలరావు, తండ్రి: మణిరాజు, పురుషుడు, వయసు 50 సం॥లు, ప్రాపర్టిస్, చేబ్రోలు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
...రెస్పాండెంటు /ప్రతివాది

పై నెంబరు ఫైనల్ డిక్రి పిటీషను షెడ్యూలు దాఖలు ఆస్థిని శ్రీ కోర్టు వారు **ది.27-03-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలం వేయుదురు.** సదరు ఆస్థి వేలం పిటీషనరు /వాదికి చెల్లించవలసిన తనక బాకీ నిమిత్తం రెస్పాండెంటు /ప్రతివాదికి చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి వేలం వేయబడుచున్నది. కావున ఆసక్తి కలవారు శ్రీ కోర్టు వారి ఎదుట సదరు వాయిదా రోజున హాజరు కావలసిందిగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, చేబ్రోలు పంచాయితీ మరియు గ్రామం, గ్రామ కంఠం, ఆర్.ఎస్.నెం. 122/2, స్థలం 60 చ॥గ॥ ఇందులో గల ఆర్.సి.సి. బిల్డింగు, పాత తలుపు నెం.4-30, కొత్త తలుపు నెం.7-153, కరెంటు సర్వీసు నెం.588 ఈదిగువ హద్దులు మధ్య: **తూర్పు:** ఉమ్మడి దారి. **దక్షిణం:** వంకాయల సత్యం గారి గోడ. **పడమర:** రోడ్డు. **ఉత్తరం:** బోడెపు రాంబాబు, ఈ ఆస్థికి మధ్య గోడ. పై హద్దుల మధ్య 60 చ॥గ॥ స్థలం ఇందులో గల ఆర్.సి.సి. బిల్డింగు సర్వం సహా.

పి.వేణుగోపాల చౌదరి
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 93469 60767